క్లుప్తంగా

బ్యాడ్మింటన్, టెన్నిస్‌లో సిద్ధార్థ వైద్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఈ నెల 8, 15, 16,17 తేదీల్లో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగాయి. ఆ పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీల్లో సత్తా చాటారు. బాల్ బ్యాడ్మింటన్‌లో మొదటి బహుమతి సాధించగా, టెన్నిస్‌లో తృతీయ బహుమతి పొందారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.విజయ, డాక్టర్ ప్రశాంతి, డెప్యూటీ కలెక్టర్(అడ్మినిస్ట్రేటర్) పి.సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాము జరుబుల అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు తాళ్ళూరి శ్రీదేవి, అంజిబాబు, అంజుస్వామి, తాళ్ళూరి రవి,, గోవిందరవి, రాజు, స్వామి, చరణ్ రాజ్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ఎర్రన్నగూడెం శ్రీ బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంయుక్త నిర్వహణలో విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా సభ్యులు నీటి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అధ్యక్షుడు కావలిపురపు బాలకృష్ణ మాట్లాడుతూ మంచినీటి ప్రాముఖ్యతను తెలియజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఇప్పటికే రాజమండ్రి, జంగారెడ్డిగూడెం,ఎర్నగూడెం పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ తిరుపతి ప్రసాదు, ఆంజనేయులు, రొక్కం శ్రీను, వెంకన్న, పెద్దిరాజు, తనూజ, శివకుమారి, మానస, గాయత్రి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మ్యాట్ ఏర్పాటు చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఎండల దృష్ట్యా నిత్యం వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని దుర్గాపురంలోని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొండ మీద ఘాట్ రోడ్డు మీదకు వచ్చే వాహనాలు పార్కింగ్ చేసిన తరువాత ఆలయానికి వెళ్లే క్రమంలో రోడ్డు వేడికి తట్టుకోలేక పాదచారుల కాళ్లు బొబ్బలెక్కుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్ మీద నడవటానికి వైట్ సిమెంట్, మ్యాట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కేవీఆర్ స్మారక ఉపన్యాసం

విజయవాడ కల్చరల్: కేవీఆర్ శారదాంబ స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కేవీఆర్(కేవీ రమణారెడ్డి) స్మారకోపన్యాస కార్యక్రమాన్ని హోటల్ స్వర్ణా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకుడు అరసవిల్లి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఖాశిం సంస్మృతి- భావజాలం : కేవీఆర్ దృక్పథం అన్న అంశంపై ప్రసంగిస్తారని, కేవీఆర్ లేఖలు పుస్తకాన్ని చెంచయ్య ఆవిష్కరిస్తారని తెలిపారు. సాయిబాబాతో మా అనుబంధం అంశంపై వసంత, మంజీరా ప్రసంగిస్తారని తెలిపారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి సంరక్షణకు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన నీటి సంరక్షణ- మంచు కొండలను కాపాడుదాం అనే అంశంపై అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె నీటి కొరత వల్ల వచ్చే నష్టాలను వివరించారు. భవిష్యత్తులో నీటి కష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, కావున నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నీటిని సంరక్షించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

సింగ్‌నగర్ వాసులకు తాగునీటి కష్టాలు

- అరకొరగా మంచినీటి పంపిణీ
- పైపుల నుంచి మురుగు నీరు, పురుగులు
- తుప్పు పట్టిన పైపులైన్‌లు
- వృథాగా పోతున్న తాగునీరు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



నాగసాయి ఆలయం రోడ్డులో లీకులతో వృథాగా పోతున్న తాగునీరు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): తాగునీటి ఎద్దడితో సింగ్‌నగర్ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిందెడు నీటి కోసం మహిళలు గంటల కొద్దీ కుళాయిల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఈ ప్రాంతంలో నెలకొంది. తాగునీటి కోసం వేకువ జామునుంచే కుళాయిల వద్ద పడిగాపులు పడుతున్నా తీరా అరకొరగా వచ్చే నీరు రెండు, మూడు బిందెలకు మించకపోవటంతో వాటితోనే సరిపెట్టుకోవలసి వస్తోందని స్థానిక మహిళలు వాపోతున్నారు.

కుళాయిల్లో కలుషిత నీరు

తాగునీటి కోసం కుళాయి తిప్పితే రంగు మారిన నీళ్లు, కలుషితమై దుర్గంధంతో వస్తున్నాయని, కాసేపు ఆగి పట్టుకుందామన్నా నీళ్లు అరగంట మించి రావటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుప్పుపటిన పైపులైన్లు..

ఈ ప్రాంతంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్లు తుప్పు పట్టి అడుగడుగునా లీకులు ఉండటంతో నిత్యం తాగునీరు కలుషితమై మురుగుతో కలసిపోయి రంగు మారి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దుర్గంధభరితంగా వస్తున్న ఈ నీటిని తాగి తాము రోగాల పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అడుగడుగునా ఏర్పడిన పైపులైన్‌ల లీకులతో వందల లీటర్ల నీరు వృథాగా పోవటమే కాకుండా కలుషితంగా మారుతున్నాయని అంటున్నారు.

క్యాన్ పది... ఖర్చు వంద..

పైపులైన్‌లలో వచ్చే నీరు తాగలేక బయటనుంచి వాటర్ క్యాన్‌లను కొంటున్నామని, రూ.10 ఉన్న క్యాన్‌ను తెచ్చుకునేందుకు ఆటోలకి రూ.100 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నగరమైన విజయవాడలో తాగునీరు కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు.



పైపుల ద్వారా వస్తున్న మురుగునీరు

ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు ముదిరితే పరిస్థితి ఏమిటి?

వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు ఈ విధంగా ఉంటే రానున్న రెండు మూడు నెలల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తలుచుకుంటేనే భయమేస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పన్నులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు

ప్రతి ఏటా ఇంటిపన్ను, నీటి, డ్రైనేజి పన్నులను ముక్కుపిండి వసూలు చేసే నగరపాలక సంస్థ అధికారులు తాగునీటి సరఫరా మాత్రం పట్టించుకోకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు వస్తుందని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా, పైపులైన్‌లు మార్చక పోతే తాము మాత్రం ఏమీ చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

తాగటానికి కాదు కదా.. ఇతరత్రా కూడా పనికిరావు



పైపుల్లో వచ్చే రంగు మారిన, దుర్గంధంతో వచ్చే నీళ్లు తాగటానికే కాదు ఇంట్లో ఇతర అవసరాలకు కూడా పనికి రాకుండా ఉంటున్నాయి. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోలేదు.

–దేవి, సింగ్‌నగర్

ఆసుపత్రుల చుటూ తిరగాల్సివస్తోంది



వంటలకు, ఇంట్లో వాడుకోవటానికి అ నీటినే వాడుకోవలసి వస్తోంది. దీంతో రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సివస్తోంది. నెల నెలా ఖర్చులకు తోడు వైద్యానికి అదనంగా ఖర్చవుతోంది.

–విజయలక్ష్మి, సింగ్‌నగర్

టిడ్కో ఇళ్ల పంపిణీలో కూటమి ప్రభుత్వ జాప్యం

టిడ్కో ఇళ్ల పరిశీలనలో సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మండిపడ్డారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం జక్కంపూడి, వేమవరం టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. బ్యాంకుల నోటీసులు పరిగణనలోకి తీసుకోనవసరం లేదని, రూ.150 కోట్ల బకాయిలు డిసెంబర్ నాటికి ప్రభుత్వమే చెల్లిస్తుందని టిడ్కో చైర్మన్ ఇళ్ల సందర్శన సమయంలో భారీ నజరానా అంటూ ప్రకటించారని గుర్తు చేశారు. నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఇళ్ల నిర్మాణ పనులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లింపులు చేయకపోవడంతో టిడ్కో ఇళ్ల పనులు నిలిచిపోయాయని తెలిపారు. గత ఏడాది వచ్చిన వరదల కారణంగా ఇళ్లు పాడైపోయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత టీడీపీ పాలనలో నగరంలో 6,573 మందిని ఎంపిక చేసి ఇళ్లు కేటాయించారని తెలిపారు. వారి నుంచి రూ.25వేలు, రూ.50వేలు, లక్ష రూపాయలు లబిదారులతో కట్టించుకుని సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్ల కేటాయింపులు జరపలేదని చెప్పారు. తక్షణమే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించి, లబ్ధిదారులతో టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని కోటేశ్వరరావు ప్రకటించారు. ఇళ్లను సందర్శించిన వారిలో నగర పార్టీ సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు భాస్కరరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవింద రాజులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ ఎగ్జిబిషన్ తొలిరోజు విశేష స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఎగ్జిబిషన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. బందర్ రోడ్‌లోని అమరావతి కన్వెన్షన్స్‌లో ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు తొలిరోజు సందర్శకుల నుంచి మంచి స్పందన లభించిందని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా చెప్పారు. సంస్థ అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలలో పర్యాటకాసక్తిని పెంపొందించడం, వారి సెలవుల్లో అత్యుత్తమ పర్యాటక అనుభవాలను అందించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. వేసవి సెలవులు, వారాంతపు విహారయాత్రలు, హనీమూన్‌లే కాకుండా ఏడాది పొడవునా సెలవుల్లో ప్రయాణాలు, పర్యాటకానికి అనుకూలమైన అవకాశాలు అందిస్తామన్నారు.

నగరంలో శ్రీవారి ఉదయాస్తమాన సేవలు



శ్రీవారి ఉదయాస్తమాన సేవల్లో భక్తులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో నిర్వహించే ఉదయాస్తమాన సేవల తరహాలో విజయవాడలోనూ నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో బృందావన కాలనీలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ వారి ఆలయం తరహాలో తీర్చిదిద్ది సేవలను నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, పసుపు కొట్టడం, అష్టోత్తర శతకలశాభిషేకం వంటివి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెంట్రల్ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ వెస్ట్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉదయాస్తమాన సేవలు రెండు రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని రోటరీ క్లబ్ ప్రతినిధులను వారు అభినందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మిడ్ టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ తిరుమలలో జరిగే విధంగా ఉదయాస్తమాన సేవలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ప్రతి సేవను కనులారా వీక్షించాలని భక్తులు భావిస్తారని, అందుకే విజయవాడలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉచితంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం కూడా ఈ సేవలు కొనసాగుతాయన్నారు. క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ బాలాజీ, కన్వీనర్ యడ్ల పార్థసారథి, సెక్రటరీ బి.సుందర్ రెడ్డి, కాసుల బ్రహ్మం, సంపత్, వనమా గణేష్, చారుగుండ్ల రమేష్, నంబూరు జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా సంప్రదాయ నృత్య సంగమం


కేరళ బృందం వారి శాస్త్రీయ నృత్య హేల



"సత్యాంజలి అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్" కేరళ బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యహేల

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని కళాపీఠం వేదికపై కేరళకు చెందిన సత్యాంజలి అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ సంస్థ నిర్వాహకురాలు అనుపమా మోహన్ బృందం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికింది. రస ప్రపంచం పేరుతో పంచభూతాల ప్రాభవాన్ని చాటే విధంగా రూపొందించిన నృత్య కార్యక్రమం సంప్రదాయ విలువలను చాటింది. మోహినీ యాట్టం (జలం), కేరళవాదనం(అగ్ని), భూమి(పృథ్వి), భరతనాట్యం(ఆకాశం), కూచిపూడి(వాయువు) సంప్రదాయాలను మనోహరంగా ప్రదర్శించారు. నృత్య కార్యక్రమంలో అనుపమా మోహన్, డాక్టర్ కళామండలం సుగంధి, డాక్టర్ ఎస్.లేఖా ధంకచి, ఆర్ఎల్‌వీ ఆనంద్ పాల్గొన్నారు. నృత్య కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం సాంస్కృతిక కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, కళాపీఠం నిర్వాహకులు లలిత్ ప్రసాద్, సిద్ధార్థ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం తోడ్పాటు



పాయకాపురం(విజయవాడరూరల్): మహిళల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందజేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తి నగర్‌లోని కమ్యూనిటీ హాలులో శనివారం 62,63,64 డివిజన్లలోని మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాలను ప్రారంభించారు.

వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి చెక్కులు

ప్రజాశక్తి నగర్‌లో 63వ డివిజన్‌కు చెందిన పేదలు 14 మందికి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో బత్తుల కొండ, లబ్బ వైకుంఠం, పైడి తులసి, కోలా శ్రీను, మోత్కూరు ఖాసీం, జైపాల్, బీడీఆర్ పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యాన వికసిత్ భారత్ 2047 పై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బీవీ మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యసించారు. యువత టెక్నాలజీని ఉపయోగించుకుని పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యంపాల్గొన్నారు.

ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు అందించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రకృతి నుంచి మనం పొందుతున్న సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేసీపీ గ్రూప్ ఈహెచ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జి.బాలకృష్ణ అన్నారు. సుస్థిర భవిష్యత్‌ను నిర్దేశించే పర్యావరణ, సామాజిక పాలన కారకాలు అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ సహకారంతో పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో వెబినార్ హాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం జరిగింది. గౌరవ అతిథి, సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 4,500 ఆస్పత్రుల నుంచి తమ సంస్థ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేసి పర్యావరణ కాలుష్యాన్ని దూరం చేస్తోందని తెలిపారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్ సీ జంపాల, ప్రిన్సిపాల్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, లీడ్ ఈఎస్‌జీ కార్పొరేట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరీష్ శ్రీవాత్సవ వంగల, ఎంఎస్‌సీఐ సీనియర్ అసోసియేట్ టి.శశిజోత్స్న, సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్ రహమాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ అసమర్థతతోనే లైంగిక దాడులు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై పెచ్చరిల్లుతున్న అరాచకాలు, దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గన్నవరంలో మైనర్ బాలికపై 8 మంది మృగాళ్ల సామూహిక అత్యాచార ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. రోజురోజుకు మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రంలో ఎక్కడా మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముక్కుపచ్చలారని చిన్నారులను ఎత్తుకెళ్లి అత్యాచారాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని ధ్వజమెత్తారు. గన్నవరంలో చోటుచేసుకున్న అత్యాచార ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆడపిల్ల క్షేమంగా తిరిగి వస్తుందన్న నమ్మకం లేదంటే ప్రభుత్వ చేతకానితనమే కారణమని ఆరోపించారు. అదే నియోజకవర్గంలో ఉంటూ కూడా బాధితురాలిని హోం మంత్రి పరామర్శించకపోవటం బాధాకరమని మల్లాది విష్ణు అన్నారు. దిశ యాప్ ఉంటే మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉండేదని, నిమిషాలలోనే ఆడపడుచులకు రక్షణ లభించేదని చెప్పారు. మహిళల భద్రత విషయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దిశ యాప్ ను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. హోం మంత్రి సొంత జిల్లాలో మైనర్ బాలిక బద్ది దర్శిని(13) హత్య, విజయవాడ బృందావన్ కాలనీలో ప్రేమోన్మాది ఘాతుకం, విశాఖ మధురవాడలో ఐదేళ్ల బాలికపై లైంగికదాడి, పాడేరులో ఆరేళ్ల చిన్నారిపై సామూహిక అత్యాచార ఘటనలు నిత్యకృత్యమైనా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై ఇప్పటికీ సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక్కసారి కూడా స్పందించలేదని మల్లాది విష్ణు ఆరోపించారు. ఈ ఘటనలపై హోంమంత్రిని ప్రశ్నిస్తే విచారణ జరుపుతామని చేతులు దులుపుకొంటున్నారు తప్ప బాధితురాలికి మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడంలో ఉన్న చిత్తశుద్ధి, శ్రద్ధ నేరస్తులను శిక్షించడంలోనూ చూపాలని డిమాండ్ చేశారు. లేదంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా పోరాటాలకు సిద్ధమవుతుందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు హెచ్చరించారు.

కనులపండువగా పూలంగి సేవ



శ్రీ కోదండ రామాలయంలో పూలంగి సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి పూలంగి సేవ కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పలు రకాల పుష్పాలతో కోదండరామునికి పూలంగి సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ముత్యాలంపాడు పురవీధులలో ఊరేగించారు. మహిళలు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డి.శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు తదితరులు పర్యవేక్షించారు.

వసంత నవరాత్రోత్సవాలలో విశేష పుష్పార్చనలు

ఆర్జిత సేవా టికెటు రూ.2,500

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 30వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు జరిగే నవరాత్రోత్సవాలలో అమ్మవారికి ప్రతి నిత్యం విశేష పుష్పార్చన నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్పార్చన జరుగుతుంది. విశేష పుష్పార్చనలో పాల్గొనే ఉభయదాతలు రూ.2500 టికెటు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ టికెటుపై ఇద్దరు సేవలో పాల్గొనడంతో పాటు వారికి అమ్మవారి అంతరాలయ దర్శనం, శేషవస్త్రం, అమ్మవారి శ్రీచక్రపీఠం, పెద్ద లడ్డూను అందజేస్తారు.

ఏ రోజు ఏ పుష్పాలంటే...!

ఈనెల 30వ తేదీ ఆదివారం మల్లెపూలు, మరువం , 31వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలు, ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం చామంతి, ఇతర పూలు, 2వ తేదీ బుధవారం మందార పూలు, ఎర్రకలువలు, 3వ తేదీ గురువారం తెల్ల జిల్లేడు, మారేడు, తులసీ, మరువం, ధవళం, 4వ తేదీ శుక్రవారం కాగడా మల్లెలు, జాజులు, మరువం, 5వ తేదీ శనివారం ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరు, సన్నజాజులు, 6వ తేదీ ఆదివారం చామంతి, సంపంగిపూలు, 7వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. విశేష పుష్పార్చన అనంతరం అమ్మవారికి సమర్పించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేస్తారు.

నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

డీఎల్‌పీఓ రాఘవన్

విజయవాడరూరల్: ఈ నెలాఖరులోగా విజయవాడ డివిజన్ లోని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను నూరు శాతం వసూలు చేయాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. ఆయన శనివారం జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. డివిజన్‌లో ఇంటిపన్ను, నీటిపన్ను, వీధి దీపాల పన్ను, డ్రైనేజీ పన్నుల డిమాండ్ 43కోట్ల 96లక్షల 83వేల 455 రూపాయలకు గాను 29 కోట్ల 80లక్షల 94వేల 374 రూపాయలు వసూలైందన్నారు. ఇప్పటివరకు కేవలం 66 శాతమే వసూలైందన్నారు. మిగిలిన మొత్తాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. నాన్ ట్యాక్స్‌ల డిమాండ్ 7కోట్ల 39లక్షల 20వేల 522 రూపాయలకు గాను 4కోట్ల 72లక్షల 31వేల 924 రూపాయలు వసూలైందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... నెల్లూరు జిల్లా కందుకూరు మండలం వల్లేటివారిపాలేనికి చెందిన బ్రహ్మానందరెడ్డి ఈనెల 6న విజయవాడ ఊర్మిళా నగర్‌లో ఉంటున్న బంధువు వెంకటనారాయణ రెడ్డి ఇంటికి వచ్చాడు. 7వ తేదీ రాత్రి సొంత గ్రామానికి వెళుతున్నానని చెప్పి తిరుగు పయనమయ్యాడు. కానీ ఇప్పటివరకు సొంతూరు వెళ్లలేదు. బ్రహ్మానందరెడ్డి ఆచూకీ కోసం అతని తండ్రి పెద్ద గోవిందరెడ్డి బంధువులు, స్నేహితులను ఆరా తీశాడు. కానీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.